క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన ఆర్‌డీఓ



జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాకు మొక్కను అందజేస్తున్న పత్తికొండ ఆర్డీఓ ఎస్.భరత్‌నాయక్

కర్నూలు కల్చరల్: జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను పత్తికొండ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్.భరత్‌నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆర్‌డీఓ కలెక్టర్‌ను క్యాంప్ కార్యాలయంలో కలిసి పూల మొక్కను అందజేశారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించాలి



క్రీడాదుస్తులు పంపిణీ చేసిన రెండవ పట్టణ సీఐ నాగరాజరావు

కర్నూలు (టౌన్): ఈనెల 9, 10 తేదీల్లో నంద్యాల జిల్లా చాగలమర్రిలో నిర్వహిస్తున్న 53వ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు సాధించాలని రెండవ పట్టణ సీఐ నాగరాజరావు సూచించారు. మంగళవారం స్థానిక కొత్తపేటలోని స్టేషన్ ప్రాంగణంలో సీఐ క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు.ఆయన మాట్లాడుతూ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలన్నారు.

విజయనగరం కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి



నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సచివాలయాల ఉద్యోగులు

కర్నూలు (టౌన్): విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగిన రెవెన్యూ రివ్యూ సమావేశంలో సచివాలయ ఉద్యోగులను హిజ్రాలతో పోల్చిన కమిషనర్‌పై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని వార్డు పరిపాలన కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవి, సంతోష్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక నగరపాలక సంస్థ ఎదుట సచివాలయాల ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ సేవల్లో కీలకంగా ఉంటూ పనిచేస్తున్న సచివాలయాల ఉద్యోగులను కించపరిచే విధంగా మాట్లాడటం కమిషనర్‌కు తగదన్నారు. విజయనగరం మున్సిపల్ కమిషనర్ నిత్యం అనుచిత వ్యాఖ్యలతో సచివాలయాల ఉద్యోగులను వేధిస్తున్నారని, కించపరచడం ఆయన నైజంగా మారిందని వాపోయారు. ప్రభుత్వం వెంటనే ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు రవికిరణ్, వివ, శివ శంకర్, సయ్యద్ కరీమ జయలక్ష్మీ, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్‌యూలో అక్రమాలపై విచారణ చేయాలి



ఆర్‌యూ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రభుత్వం విచారణ చేపట్టాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్‌యూ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, భీమ్ ఆర్మీ రాష్ట్ర కన్వీనర్ విజయభాస్కర్, అంబేడ్కర్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుకృష్ణ మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టు, నాన్ టీచింగ్ ఉద్యోగులకు అక్రమంగా టైమ్ స్కేల్ ఇచ్చి హెచ్‌ఆర్‌ఏ, ఐఆర్ వర్తింపజేస్తూ పదోన్నతులు కల్పించారని ఆరోపించారు. టైమ్ స్కేల్ ఉద్యోగులను నిబంధనలకు విరుద్ధంగా రెగ్యులర్ చేశారన్నారు. విద్యార్థులు చెల్లించిన ఫీజులను విద్యార్థుల సంక్షేమానికి వినియోగించకుండా నాన్ టీచింగ్ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నారని విమర్శించారు. వీటన్నింటికీ పాలకమండలిలో ఆమోదం లేకున్నా అమలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామరాజు, జిల్లా కార్యదర్శి వెంకటేష్, నాయకులు రమేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

చతికిలపడిన ఆప్కో

- మూత పడుతున్న షోరూమ్‌లు
- శ్రీనివాస క్లాత్ మార్కెట్‌లోని షోరూమ్‌లను ఖాళీ చేయించిన టీడీపీ నేతలు
- మంగళగిరి నుంచి కొత్త స్టాక్ వస్తే ఒట్టు
- డివిజనల్ మార్కెటింగ్ ఆఫీసర్ పోస్టు ఖాళీతో ఇష్టారాజ్యం
- పండగ పూట కూడా తెరుచుకోని షోరూంలు

కర్నూలు(అగ్రికల్చర్): చేనేత వస్త్రాలను మార్కెటింగ్ చేసే ఆప్కో పరిస్థితి నేడు దయనీయంగా మారింది. ఆప్కో చతికిల పడటంతో చేనేత వస్త్రాల మార్కెటింగ్ ప్రశ్నార్థకం అవుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేనేత వస్త్రాల మార్కెటింగ్‌కు అనేక చర్యలు చేపట్టగా కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఆప్కో షోరూములు మూతపడే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే కర్నూలు పాత బస్టాండులోని శ్రీనివాస క్లాత్ మార్కెట్‌లో ఉన్న ఆప్కో షోరూము మూత పడింది. తెలుగుదేశం పార్టీ నేతలే ఆప్కోపై ఒత్తిడి తెచ్చి ఖాళీ చేయించినట్లు సమాచారం. చేనేత వస్త్రాల మార్కెటింగ్‌కు కొత్త షోరూములు ఏర్పాటు చేయాల్సి ఉండగా.. ఉన్నవి కూడ మూత పడుతుండటం గమనార్హం. షోరూము అగ్రిమెంటు పూర్తయినా పొడిగించాలని కోరుతున్నప్పటికీ టీడీపీ నేతలు జోక్యం చేసుకొని ఖాళీ చేయించడాన్ని బట్టి చూస్తే చేనేత వస్త్రాలపై ఉన్న ప్రేమ ఏపాటిదో తెలుస్తోంది. ఆప్కో గురించి ప్రభుత్వం పట్టించుకోవడమే మానేసినట్లు తెలుస్తోంది. ఆప్కో షోరూములకు మంగళగిరిలోని ఆప్కో గోదాము నుంచి సరుకు రావాల్సి ఉంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత మంగళగిరి నుంచి షోరూములకు సరుకు రావడం తగ్గిపోయింది. నేటి పోటీ ప్రపంచంలో చేనేత మనుగడ సాగించాలంటే రకరకాల డిజైన్‌లు అవసరం. నాణ్యత కూడా మరింత ఉండాలి. అప్పుడే వినియోగదారులను ఆకర్షి స్తాయి. దసరా సమయం అయినప్పటికీ షోరూములకు కొత్త స్టాకు రాకపోవడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. దసరా వేళ వస్త్ర దుకాణాలు కిటకిటలాడుతుంటే ఆప్కో షోరూములు మాత్రం వెలవెలబోతున్నాయి. కారణం డిజైన్లు, స్టాకు లేకపోవడమే. ఎవరైనా పండగ పూట వ్యాపారం పెంచుకోవడానికి ప్రయత్నిస్తారు. ఆప్కోలో మాత్రం ఇది లోపించింది.

పండుగ ముంగిట తెరచుకోని షోరూములు

ఆప్కో షోరూముల నిరంతర పర్యవేక్షణ, చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచడం తదితర వాటిని పర్యవేక్షించేందుకు జిల్లాకు డివిజనల్ మార్కెటింగ్ ఆఫీసర్ పోస్టు ఉంది. ఈ పోస్టులో ఉన్న భారతి ఈ ఏడాది జూన్ చివర్లో పదవీ విరమణ చేశారు. ఈ స్థానంలో ఎవ్వరినీ నియమించలేదు. అనంతపురం జిల్లా డివిజనల్ మార్కెటింగ్ మేనేజర్ మధుబాబును ఉమ్మడి కర్నూలు జిల్లాకు ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఈయన వారంలో ఒక్క రోజు మాత్రమే ఇక్కడికి వచ్చిపోతున్నట్లు తెలుస్తోంది. షోరూములను పర్యవేక్షించాల్సిన అధికారే లేకపోవడంతో షోరూములను తెరవడం కూడ కష్టమైంది. కలెక్టరేట్ ప్రాంగణంలోని చేనేత భవన్ కాంప్లెక్స్‌లో ఆప్కో షోరూం ఉంది. ఎప్పుడు తెరుస్తారో? ఎపుడు మూస్తారో? తెలియని పరిస్థితి ఏర్పడింది. పండుగ ముంగిట కూడా షోరూంకు లాక్ వేసి ఉండటంతో ఎంతో మంది నిరాశతో వెనుతిరిగి పోతున్నారు. డివిజనల్ మార్కెటింగ్ అధికారి పర్యవేక్షణ లోపించడం వల్ల ఎవరికి వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

తగ్గిన వ్యాపారం

గత ఏడాదితో పోలిస్తే ఆప్కో వ్యాపారం తగ్గిపోయింది. ఆప్కో బాగోగుల గురించి ప్రభుత్వ పెద్దలు పట్టించుకోకపోవడం వల్లనే చతికిలపడే పరిస్థితి ఏర్పడింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో రూ.1.17 కోట్ల వ్యాపారం జరిగింది. 2024-25 మొదటి ఆరు నెలల్లో చేయాల్సిన వ్యాపారం రూ.1.94 కోట్లు ఉండగా కేవలం రూ.కోటి వ్యాపారం మాత్రమే జరిగింది. గత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలలతో పోల్చినా వ్యాపారం తగ్గుముఖం పట్టినట్లు తెలుస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఆప్కో ద్వారా చేనేత వస్త్రాల వ్యాపారం పెంచేందుకు ప్రత్యేక ఆఫర్లు ఇవ్వడం జరిగింది. ఉద్యోగులు, ఇతర వర్గాల వారికి ప్రత్యేక స్కీమ్‌లు పెట్టి చేనేత వస్త్రాల వైపు మళ్లించే విధంగా చర్యలు తీసుకున్నారు.



కలెక్టరేట్‌లోని చేనేత భవనం కాంప్లెక్స్‌లో లాక్ చేసిన ఆప్కో షోరూం

యూనిఫామ్‌కు నిధులు నిల్

వివిధ ప్రభుత్వ శాఖల్లో కింద స్థాయి ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బంది తదితరులకు యూనిఫామ్‌కు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ ఇస్తుంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసే సిబ్బందికి, మున్సిపల్ కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీల సిబ్బందికి, వివిధ ప్రభుత్వ శాఖల్లోని ఆఫీస్ సబార్డినేట్‌లకు యూనిఫామ్ ఇస్తారు. యూనిఫామ్‌లను ఆప్కో నుంచే కొనుగోలు చేస్తారు. యూనిఫామ్‌లకు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఎలాంటి బడ్జెట్ ఇవ్వలేదు. ఆప్కో చతికిల పడటానికి ప్రభుత్వమే కారణమనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

వంటనూనెలు నిర్దేశిత ధరకే విక్రయించాలి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య

కర్నూలు కల్చరల్: నిర్ణయించిన ధరకే వంటనూనెలు విక్రయించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య నూనె మిల్లుల యజమానులు, వ్యాపారులను ఆదేశించారు. మంగళవారం కాన్ఫరెన్స్ హాల్‌లో వారితో పౌర సరఫరాల శాఖ అధికారులు ఏర్పాటు చేసిన సమావేశంలో జేసీ మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యార్థం తినదగిన నూనె, పామాయిల్, సన్‌ఫ్లవర్ నూనె ధరలను నిర్ణయించామన్నారు. సన్‌ఫ్లవర్‌లో సన్‌ప్యూర్, సన్‌జ్యోతి, సన్‌ప్రీతి బ్రాండ్లు రూ.126 చొప్పున జిల్లాలోని రైతుబజార్లలో, బహిరంగ మార్కెట్‌లోని అన్ని నూనె దుకాణాల్లో, సూపర్ మార్కెట్‌లలో లభిస్తుందన్నారు. అన్ని రైతుబజార్లలో టమాట కేజీ రూ.42, ఉల్లిగడ్డ కేజీ రూ.36కు వినియోగదారులకు అందించేందుకు నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి రాజా రఘువీర్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

కర్నూలు(హాస్పిటల్): వ్యక్తిగత, పరిసరాల శుభ్రతలో ఆరోగ్యం దాగి ఉందని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులుశెట్టి చెప్పారు. ఆయన మంగళవారం నగరంలోని శ్రీరామనగర్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న ఆశా డే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆరోగ్య సేవల వివరాలను ఈ-ఆశా యాప్‌లో క్రమం తప్పకుండా నమోదు చేయాలని సూచించారు. లింగ వివక్ష నిర్మూలన, గర్భస్థ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం, ఆడపిల్లల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతి, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

జయములివ్వమ్మా.. జగజ్జననీ



చిన్మయ మిషన్‌లో మాతృ పూజలో పాల్గొన్న భక్తులు



భరతమాత ఆలయంలో..



అంబా భవానీ ఆలయంలో..



బుధవార పేట కాళికాంబ ఆలయంలో..



రాజరాజేశ్వరీ ఆలయంలో..



గణేష్ నగర్ విజయ గణపతి ఆలయంలో..



సప్తగిరి నగర్ చౌడేశ్వరి ఆలయంలో మహాలక్ష్మిగా..



గోదాగోకులంలో విజయలక్ష్మిగా..



నాగలాపురంలో మహాలక్ష్మిగా..



వెంకాయపల్లి ఎల్లమ్మ ఆలయంలో మహాలక్ష్మిగా..



బిర్లాగేట్ శంకర మందిరం వద్ద..



కల్లూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో



గీతా మందిరంలో శాకాంబరీ దేవిగా..



లలితా పీఠంలో లలితా సుందర దేవి



సప్తగిరి నగర్ చౌడేశ్వరి ఆలయంలో..



నిమిషాంబ దేవి ఆలయంలో..



నన్నూరు సరస్వతీ ఆలయంలో గౌరీ దేవిగా..



తాండ్రపాడులో..



కృష్ణానగర్‌లో కొలువు దీరిన దుర్గామాత



వడ్డేగేరిలో పూజలందుకుంటున్న దుర్గమ్మ

కర్నూలు కల్చరల్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు మంగళవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. నగరంలోని ఆలయాల్లో అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. గీతా మందిరంలో శాంకబరీ దేవిగా, నన్నూరు సరస్వతీ దేవి ఆలయంలో గౌరీ దేవిగా, ఆరోరానగర్ రాజరాజేశ్వరీ ఆలయంలో లలితా త్రిపుర సుందరిగా, గోదాగోకులంలో విజయ లక్ష్మిగా, బండి మెట్ట అంబా భవానీ ఆలయంలో గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. చిన్నమ్మవారి శాల, పెద్ద అమ్మవారి శాల, వన్‌టౌన్ కాళికాంబ ఆలయం, సూర్యనారాయణ స్వామి ఆలయాల్లో వివిధ రూపాల్లో అమ్మవారిని అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వీఆర్ కాలనీలోని చిన్మయ మిషన్‌లో స్వామిని సుప్రేమానంద సరస్వతి ఆధ్వర్యంలో మాతృ పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకాలు, హోమాలు, రథోత్సవం, పల్లకీసేవ, లలితా సహస్రనామ పారాయణం, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన దుర్గా మాత విగ్రహాలకు పూజలు చేశారు. ఆధ్యాత్మిక నృత్యాలు, భక్తి సంగీత కచేరీలు, సంకీర్తనలు, కోలాటం, చెక్క భజన, హరికథలు, నవరాత్రులపై ప్రవచనాలు జరిగాయి. ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజల్లోకి తపాల బీమా పథకాలు

కర్నూలు(అర్బన్): తపాల జీవిత బీమా, గ్రామీణ తపాల జీవిత బీమా పథకాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పోస్టల్ సూపరింటెండెంట్ జనార్దన్‌రెడ్డి సూచించారు. జాతీయ తపాల దినోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక కార్యాలయంలో డైరెక్ట్ ఏజెంట్స్, ఫీల్డ్ ఆఫీసర్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఆర్థిక భరోసా పెంపొందించేందుకు జీవిత బీమా పథకాలకు విస్తృత ప్రచారం కల్పించాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే ఈ ఆర్థిక సంవత్సరంలో (ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు) ఎక్కువ పాలసీలు చేయించిన ఏజెంట్లకు బహుమతులు అందించారు. అసిస్టెంట్ సూపరింటెండెంట్ నూరుల్లా, పోస్టల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ హరి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఏజెంట్లు, ఫీల్డ్ ఆఫీసర్లతో పోస్టల్ సూపరింటెండెంట్ జనార్ధన్‌రెడ్డి

ఎంఎన్‌ఓ మృతి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఎంఎన్‌ఓ (వార్డు బాయ్)గా పనిచేస్తున్న పి.శ్రీనివాసులు మంగళవారం ఉదయం మరణించారు. కొన్ని రోజులుగా ఆయన అనారోగ్యంతో ఆసుపత్రిలోని ఏఎంసీ విభాగంలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో కోలుకోలేక మృతిచెందారు. ఆయన మృతి విషయాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డికి తెలపగా అంత్యక్రియల ఖర్చు నిమిత్తం రూ.25 వేలను కుటుంబసభ్యులను అందజేశారు. శ్రీనివాసులు మృతి పట్ల ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.బాలునాయక్, ట్రెజరర్ కె.సురేష్, యూనియన్ నాయకులు సంతాపం తెలిపారు.



బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

వీధి కుక్కల బెడదను అరికడతాం

కర్నూలు (టౌన్): నగరంలో వీధి కుక్కల బెడదను అరికడతామని మంత్రి టీజీ భరత్ అన్నారు. మంగళవారం స్థానిక కౌన్సిల్ హాలులో ఇటీవల వీధికుక్కల కాటుకు గురైన పిల్లలకు రూ.10 వేలు చొప్పున ఆర్థిక సహాయాన్ని మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వీధి కుక్కల సంతాన నియంత్రణ ఆపరేషన్లు తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.నగరంలో పూర్తి స్థాయిలో కుక్కల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అదనపు కమిషనర్ ఆర్.జి.వి.క్రిష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రి ఇచ్చిన వివరాల ప్రకారం 36 మంది బాధితులకు ఆర్థిక సాయం అందజేశామన్నారు.ఆరోగ్యశాఖాధికారి విశ్వేశ్వర రెడ్డి, కార్పొరేటర్ పరమేష్ పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో లక్ష్యాలను అధిగమించాలి

కర్నూలు (టౌన్): నగరపాలకకు చెల్లించాల్సిన పన్ను వసూళ్లలో నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని నగరపాలక కార్యాలయ మేనేజర్ చిన్నరాముడు సచివాలయాల అడ్మిన్లను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఇందిరా గాంధీ నగర్‌లోని 111వ సచివాలయంలో 29 సచివాలయాల అడ్మిన్లతో సమావేశం నిర్వహించారు. మేనేజర్ మాట్లాడుతూ.. పన్ను వసూళ్లకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. అరియర్స్ ఉన్న పన్నుదారులకు నోటీసులు జారీ చేయాలన్నారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగరాజు పాల్గొన్నారు



మాట్లాడుతున్న మేనేజర్ చిన్నరాముడు

ఉల్లి రైతులకు బోనస్ విడుదల చేయండి

కర్నూలు(అగ్రికల్చర్): పశ్చిమ ప్రాంతంలో 2018-19లో బోర్లు, ఇతర నీటిపారుదల కింద ఉల్లి సాగు చేసిన రైతులకు పెండింగ్‌లో ఉన్న బోనస్ వెంటనే విడుదల చేయాలని ఏపీ రైతు సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ తదితరులు మార్కెట్ కమిటీ సెక్రటరీ ఆర్.జయలక్ష్మికి వినతి పత్రం సమర్పించారు. 2018-19లో ఉల్లి ధరలు పూర్తిగా పడిపోయాయని, అప్పటి ప్రభుత్వం ఉల్లి క్వింటాలుకు రూ.750 మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. అప్పట్లో క్వింటాలుకు రూ.200 నుంచి రూ.350 వరకు మాత్రమే ధర లభించిందని పేర్కొన్నారు. మిగిలిన మొత్తం ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని తెలిపారు. ఈ మొత్తాన్ని రైతులకు వెంటనే విడుదల చేసే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సెక్రటరీ జయలక్ష్మిని కోరారు. సెక్రటరీ స్పందిస్తూ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. రైతు సంఘం నాయకులు ఆంజనేయులు, ఉసేనయ్య, యేసురాజు తదితరులు పాల్గొన్నారు.



సెక్రటరీకి వినతి పత్రం సమర్పిస్తున్న ఏపీ రైతు సంఘం నేతలు

అంగన్‌వాడీల్లో రికార్డు వర్క్ తగ్గించాలి



పీడీకి వినతి పత్రం అందిస్తున్న నేతలు

కర్నూలు(అర్బన్): అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు తీసుకొచ్చిన యాప్‌లన్నీ కలిపి ఒకే యాప్‌గా మార్చి రికార్డు వర్క్ తగ్గించాలని, ఏడు నెలల నుంచి ఆరేళ్ల లోపు పిల్లలకు ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని సీఐటీయూ, అంగన్‌వాడీ అసోసియేషన్ నేతలు కోరారు. మంగళవారం సీఐటీయూ నగర కార్యవర్గ సభ్యులు మహమ్మద్ రఫీ, అంగన్‌వాడీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు రేణుకమ్మ, నగర కార్యదర్శి బాలదుర్గమ్మ, విజయలక్ష్మి ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ వివరాలను పోషణ ట్రాక్టర్ యాప్, బాల సంజీవిని యాప్‌లో నమోదు చేస్తున్నామన్నారు. అలాగే గర్భిణులు, బాలింతలకు ఎఫ్ఆర్ఎస్ ద్వారా టీహెచ్‌ఆర్ అందిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలోనే ఐదు రకాల రికార్డులు రాయాలని ఒత్తిడి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు ఒక్కొక్కరు రూ.1000 నుంచి రూ.2 వేల వరకు ఖర్చు చేసి రికార్డులను రాయడం భారంగా మారిందన్నారు. సమ్మె కాలంలో అంగీకరించిన విధంగా పనిభారం తగ్గించాలని కోరారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

కర్నూలు: వంటగ్యాస్ సిలిండర్లు డెలివరీ చేసే వాహనాలు నిబంధనలకు అనుగుణంగా నడపాలని, ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని వాహనాలను సీజ్ చేస్తామని ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ హెచ్చరించారు. నగరంలో తిరిగే అన్ని గ్యాస్ ఏజెన్సీల యజమానులు, వాహనదారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. గ్యాస్ సిలిండర్లు డెలివరీ చేసే వాహనాలకు రెండు వైపులా రెండు మీటర్ల ఎత్తు ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే వెనుకవైపు కూడా గ్యాస్ సిలిండర్లను దించేటప్పుడు ఇబ్బంది లేకుండా రెండు రాడ్లను ఏర్పాటు చేసుకోవాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. ఇష్టానుసారం ఆటోల్లో గ్యాస్ సిలిండర్లను తరలిస్తుండటం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశముందన్నారు. నిబంధనలు పాటించి సురక్షితంగా గ్యాస్ సిలిండర్లను చేరవేసేలా నిర్వాహకులు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సీఐ సూచించారు.



సూచనలు చేస్తున్న ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్

ఆరోగ్య సూత్రాలు పాటిద్దాం



మాట్లాడుతున్న వైద్యులు సోనీ సుసన్

కర్నూలు (టౌన్): సంపూర్ణ ఆరోగ్యానికి ప్రతిఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని వైద్యులు డాక్టర్ సోనీ సుసన్ అన్నారు. మంగళవారం స్థానిక కోల్స్ కళాశాల ప్రాంగణంలో చైల్డ్ ఫెలోషిప్ ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ.. పిల్లల పట్ల తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఫాస్ట్‌ఫుడ్, జంక్ ఫుడ్ వంటివి అలవాటు చేయకూడదన్నారు. మంచి అలవాట్లు, వ్యక్తిగత శుభ్రత, పరిసరాల శుభ్రతపై పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. కమిటీ చైర్మన్ ఆర్‌ఈ అనిల్ నాథ్, వైస్ చైర్మన్ విజయకుమార్, స్టెల్లా, బెంజిమిన్ పాల్గొన్నారు.